# చనుబాలు

ఈ దేశంలో సగటు మనుషులు, విలువలేని క్రిముల్లాంటివాళ్ళు. ఎలాంటి ప్రదేశాల్లో ఎలాంటి జీవితాన్ని జీవిస్తున్నారో అలాంటి ప్రదేశంలో, సంఘంలో హోదాకి, అంతస్తుకి, దర్పాలకు, దర్జాలకు, అలవాటుపడ్డ మనలాంటి మనషులన బడేవాళ్ళు ఎప్పుడూ చూడలేని, తటస్థించని తావులో అలాంటి మురికి ప్రదేశంలో ఆ రాత్రి –

ఆ రాత్రి నిజంగా, మీకూ నాకూ, డబ్బుని కాగితాల్లా విసిరి వేయగలిగే సంపాదన విలువ తెలీని ఖర్చు పరులకు, ఖుషీదారులకు అందమైన రాత్రిలా వుండేరాత్రి.

ఆ రాత్రి ఖరీదైన ఫైవ్‌స్టార్ హోటల్స్ దగ్గర్నించి మామూలు లాడ్జింగ్ హౌస్‌ల వరకూ ఆడవాళ్ళతో, వాళ్ళ అందాల్తో విందులు చేసుకునే మగవాళ్ళకు వాళ్ళ డబ్బును ఖర్చు పెట్టించే ఆ తల్లి ఎలా వుందో నేను వర్ణించి చెప్పలేను.

ఒకనాడు గొప్ప సంస్కృతిని పోషించిన ఈ భారతంలో ఈనాడు అడుగడుగునా ఏ రోడ్డు పక్కచూసినా కనబడే ముష్టితల్లుల్లో ఓ తల్లిలా వుంది.

ఆ ముష్టితల్లి నిజంగా ఓనాడు కలలన్నిట్నీ అందంగా పేర్చుకుని వాటిమీద కూర్చోడానికి సాహసించిందే. కానీ ఆ కలలన్నీ కాలిపోతాయని, ఇలా ఈనాడు మురికిలో బురదలో పందిలా బ్రతకాల్సి వస్తుందని వూహించని ఆనాటి ఆ కన్నెపిల్ల ఈనాడు ముగ్గురు పిల్లల తల్లి.

ఆగుడిసెలో ఓ మూల ఓ నులక మంచం వుంది. ఆ మంచమ్మీద ఎలక పిల్లల్లా ఇద్దరు పిల్లలు పడుకున్నారు. వాళ్ళు అప్పటి వరకూ ఏడుస్తూ అప్పుడే నిద్రపోయి వుండొచ్చు. ఆకలితో ఏడ్చి సొమ్మసిల్లి పోయిన వాళ్ళ మసిబొగ్గుల్లాంటి బుగ్గలమీద కన్నీటిచారికలు చీకట్లో కలిసిపోయాయి.

కథా నిలయం
3515
శ్రీకాకుళం



ఇంకో పిల్ల పెద్దది.

దానికి పదమూడేళ్ళ వయసుంటుంది. ఆ అమ్మాయి కూడా తల్లి వళ్ళో ఆకల్తో సొమ్మసిల్లిపోయి నిద్రపోతోంది. కానీ ఆ అమ్మాయి గుండెలమీద కప్పుకోవడానికి గుడ్డల్లేని కారణాన, తల్లి చిరిగిన చెంగు ఆపిల్ల గుండెమీద కప్పింది.

ఆ తల్లిఏడుస్తోంది. ఆ తల్లి కళ్ళ నుంచి పైకి వస్తున్న కన్నీళ్ళు చెక్కిలి మీద నుంచి కారి అస్తవ్యస్తంగా వున్న జాకెట్టు మీదపడి అక్కణ్ణుంచి చంటోడు తాగిన చనుబాలకు గుర్తులాగా మరకల మీద పడుతున్నాయి.

ఆ సమయంలో ఆ తల్లికి చచ్చిపోవాలనుంది. చచ్చిపోవడం బ్రహ్మవిద్య కాదు. రోడ్డుమీద కొచ్చి నిలబడితే, రోడ్డు మీద యెవరున్నారో లేదో అక్కర్లేని లారీ డ్రైవర్లు తలచుకుంటే చాలు హాయిగా ఆమె ప్రాణాలు పోతాయి. ఎక్కడ ఆగుతాయో ఎక్కడ సాగుతాయో తెలీని ఏ సిటీ బస్సు వచ్చేదార్లో నిలబడినా చాలు ఆమె చనిపోవచ్చు. లేకపోతే ఏ రైలెక్కినా చాలు, టిక్కెట్లు తీసినా తియ్యక పోయినా పేద దాన్ని గురించి ఎవరూ పట్టించుకోరు. కాబట్టి పోలీసులు బైటకు తోసేస్తారు. అప్పుడామె ప్లాట్‌ఫారమ్మీద కాకుండా పట్టాల క్రింద పడొచ్చు. ఇలా చనిపోడానికి సవాలక్ష మార్గాలు వున్నందున ఆ తల్లి చచ్చిపోవడం పెద్ద ప్రశ్నేం కాదు.

కానీ చావుకి మార్గం తెలీక ఆ తల్లి చచ్చిపోవడం లేదు. మరిదేనికి? బ్రతుకు మీద తీపి చావక కాదు. పిల్లల మీద ప్రేమ చావక. కానీ తనకి, తన పిల్లలకు అందమైన బ్రతుకునే వూహించుకున్న ఆ తల్లి కళ్ళల్లో ఈ సమయంలో భర్త అనబడే వ్యక్తి గుర్తుకు వచ్చాడు.

భర్త!

అప్పుడెప్పుడో వాడు రిక్షా తొక్కేవాడు. దానిమీద వచ్చే డబ్బుల్తో పూర్తిగా తాగేవాడు. ఆ తర్వాత ఇంటికొచ్చి పెళ్ళాన్ని తన్నేవాడు. అంతే. అలా పది సంవత్సరాలు గడిచాయి. నిద్రలో వచ్చే అందమైన కలల్లా పిల్లలు పుట్టుకొచ్చారు.

ఆ తర్వాత వాడు రిక్షా తొక్కడం మానేశాడు. దానిక్కారణం ఓ చెయ్యి పోవడం, పేద ప్రజల ఓట్లు తప్ప, వాళ్ళ బ్రతుకులు అక్కర్లేని రాజకీయ నాయకుడి ఎలక్షన్ల వూరేగింపులో జరిగిన ప్రతి పక్షాల దెబ్బలాటలో నష్టపడినవాడు మనవాడు. వాడికి జరిగిన నష్టం ఎవరిక్కావాలి. రెండు సానుభూతి మాటలు, రెండు సారా సీసాలు, అంతే.

ఆ తర్వాత వాడి జీవితం నడివీధిలో విరిగిపోయిన గాంధీ బొమ్మలా అయిపోయింది. అవిటివాడు ఏం చెయ్యగలడు. ఏదైనా చెయ్యడానికి సాహసించినా ఎండమావుల్లాంటి వుద్యోగ పథకాలు తప్ప ఏవున్నాయి? అంచేత వాడి జీవితం పుచ్చిపోయిన కర్రలా అయిపోయింది. ఎలాగోలాగ బ్రతకడం వాడు తెల్సుకున్నాడు. అన్నిటిలోకి సులభంగా అన్పించింది అమ్మాయిల్ని తార్చడం. వాడికా పని చెయ్యటం తప్పుకాదు. ముందుచూపు లేకుండా కన్న తల్లిదండ్రుల కడుపున పుట్టిన అమ్మాయిలకు సరైన వయసులో జరగని ముచ్చట్లను కనీసం వయసు కోసం తీర్చుకునే అమ్మాయిలకు ఆ పని తప్పుకాదు. అంచేత వీడికి వాళ్ళను కాలేజీ అబ్బాయిలకు తార్చడం తప్పుకాదు.

భర్తలు ఆఫీసు పనులమీదపై ఊరెళ్ళినపుడు, వళ్ళు కొవ్వెక్కి రోడ్డెక్కిన పతివ్రతలకు, రోమియోల దగ్గరకు వెళ్ళడం వాళ్ళకు తప్పుకాదు. ఫాషన్, అది వీడికీ తప్పుకాదు. అంచేత వీడు ఆ వచ్చే కమీషన్తో బ్రతుకుతున్నాడు. కానీ నిన్నరాత్రి ఇదే సమయం గుడిసెకెవణ్ణో తీసుకువచ్చాడు. వచ్చి చెప్పాడు -

"చూడే, ఇయ్యాల్టినుంచి మనం దర్జాగా బతికేత్తామే... కానీ నువ్వు వూ అనాలి. ఈ బాబు... ఈ బాబుకి కుదుపాం మార్కెట్టుకాడ బంగారం కొట్టున్నాది.. నువ్వు గనక వూ అంటే ఇయ్యాల్టి నుంచి నువ్వు బంగారం... నీ కూతురు బంగారం... నాను బంగారం.."

"ఏటంటున్నావు.."

"అదేనే, డైట కంపెనీల్లో గుంటలెవరూ లేరే. రెయిడని, కొత్త డియస్పీ మంచోడు కాదని వూరు దాటేశారు. ఈడికి గుంటకావాల్ట. ఎంత డబ్బు కావలిస్తే అంతిస్తాట్ట. ఇదిగో రెండొందలు. రేపియ్యాలకి దాన్ని తయారుచెయ్యి.."

అప్పుడు చూసింది తను కూతురు వైపు. నిండా పసితనం పోని వయసు, ఆరోగ్యంగా పెరిగిన శరీరం.

వద్దంది. చచ్చిపోతానంది. చంపెయ్యమంది. తాగుడు నిషాలో తన్ని వెళ్ళిపోయాడు. ఇప్పుడో, మరో సమయంలోనో వస్తాడు. తప్పదు. తన బ్రతుకు కాలిపోయింది. కలలు చెరిగిపోయాయి. కానీ తన పిల్లలు... కొడుకులు... కూతురు... అప్పుడెప్పుడో లక్ష్మీ టాకీసుసందు గుడిసెల్లో పది

రూపాయల కోసం బ్రతుకును నడివీధిలో పెట్టి పడుపు వృత్తిలో బ్రతికి, చివరకు జబ్బుల్తో రోడ్డుపక్కకు నెట్టబడి,కుళ్ళి కుళ్ళి చచ్చిపోయిన దానిలా తన కూతురు కాకూడదు.

తన ఇద్దరు కొడుకులు-అక్క వళ్ళమ్ముకునేదైతే తమ్ముళ్ళు బ్రోకర్లు, రౌడీలు, మోసగాళ్లు, కేడీలు యెవరైనా ఔతారు.

కానీ తను కన్నందుకు వాళ్ళని కనీసం పెంచలేదు. వాళ్ళ మట్టుకు వాళ్ళు పెరిగి చీకటికి అలవాటుపడి చీకటి బ్రతుకులు బ్రతుకుతారు. అంచేత తన పిల్లలు అలా కాకూడదు. తను చచ్చిపోతే వాళ్ళు అలాగే ఔతారు. ఇలాగ కాకపోతే యింకో లాగ్గైనా యిదే బ్రతుకులో యిలాగే బ్రతుకుతారు. అంచేత ...

ఆ తల్లి అలా ఎంతసేపు ఆలోచించిందో తెలీదు. రాత్రి చాలా గడిచినట్టుగా వుంది. దూరంగా వున్న బార్ కమ్ రెస్టారెంట్‌లోంచి చిన్న పిల్లల్లా అడుగు లేసుకుంటూ వస్తున్న పెద్ద మనుషులు గబగబా కార్లెక్కి పోతున్నారు.

ఏ కిళ్ళీ బడ్డీ వెనకో ఏ 'టీ'కోసమో కక్కుర్తిపడి పడుపు పనికి సిద్ధమయ్యే బజారు ముష్టిదాని దగ్గర మామూలు వసూలు చెయ్యడానికి అన్నట్టు గబగబా తిరుగుతున్నారు రక్షక భటులు.

రాత్రి మామూలుగానే వుంది. యూనివర్సిటీ రూముల్లోకి అమ్మాయిలు బాత్రూమ్ కిటికీలగుండా వెళ్ళి వస్తూనే వున్నారు. బ్రాందీ, విస్కీలు నాలుగు పాదాల్లో నడుస్తూనే వున్నాయి.

అన్నీ సజావుగానే చిక్కగానే చీకటి పద్ధతుల్లో సాగిపోతున్నాయి. కానీ ఆ తల్లి గుండెల్లో మాత్రం నీకూ, నాకూ, ఆ పోలీసు వాడికీ, పేదల గురించి పాషను కోసం కళాత్వం వ్రాసే ఏ విప్లవ, అభ్యుదయ కలానికీ అందని దుఃఖం చిక్కగా వుంది.

ఒక్కసారిగా తల్లి కూర్చున్న చోటు నుంచి లేచి, ఆ పక్కనే పెంటకుప్ప దగ్గర పడివున్న రెండు ఖాళీ సీసాల్ని తీసుకుని, రాతితో మెత్తగా నూరి సిల్వరు గ్లాసులో వున్న నీళ్ళలో ఆ గుండని కలిపి ఇద్దరు కొడుకులకు యిచ్చి, ఆ తర్వాత తన కూతురిచేతా తాగించింది. తర్వాత తనూ తాగింది.

అది జరిగిన గంట తర్వాత

ఆమె పెనిమిటి వచ్చాడు. వాడి వెనకాతల డబ్బూ, కొవ్వూ పుష్కలంగా

వున్న ఆ బంగారం కొట్టు కుర్రాడూ వచ్చాడు. "ఒసే.. అదేదీ?" ఆ పిలుపుకి మలిపలుకు లేదు.

"తొంగుండి పోనాదిగావాల.. మీరెల్లండి బాబూ.."వాడే మళ్ళీ అన్నాడు.

ఆ బంగారం కొట్టు కుర్రాడు లోనికెళ్ళాడు. లోన గుడిసెలో చీకటి వాడి జేబులో డబ్బులాగానే వాడి కళ్ళల్లో కామం లాగానే వుంది.

బైట దూరంగా వున్న వీధిలైట్లు కాంతిపడి మసక మసకగా, గుమ్మం దగ్గరే పడుకున్న ఆ పదమూడేళ్ళ పిల్ల గుడ్డల్లేని గుండెల మీద తన చేతులు వేసి పడుకున్న తల్లిని చూశాడు. తల్లిని ముట్టుకోవాలా? పిల్లను ముట్టుకోవాలా? సంశయంగా, మెల్లగా తాకాడు. వాడు ముట్టుకున్న శరీరం మెత్తగా చల్లగా వుంది. అంతవరకూ వాడికళ్ళల్లో వున్న కామం జరాజరా దిగిపోయి, దాని స్థానంలో భయం చోటు చేసుకుంది.

*ఆంధ్రజ్యోతి వీక్లీ - 8-5-1981*

*